


# అనర్హుడికోసం త్యాగం

మంజు కుర్చీలో కూర్చుని కిటికీలోంచి చూస్తోంది. తలలో ఆలోచనలు, పూర్వ స్మృతులు పరిగెడుతున్నాయి. అప్పుడప్పుడు పాలిపోయిన చెక్కిళ్ళపైనుండి కన్నీటి బిందువులు ముత్యాల్లాగ జారుతున్నాయి. ఉదకమండలం లాంటి ఊళ్ళో ఉన్నా, ఆ చల్లని వాతావరణం ఆమెకు యేమాత్రమూ సంతోషం కలిగించడంలేదు. ఆరోజులెంత బాగుండేవి! తను పెద్దదైనా చిన్న పిల్లలాగ మారాం చేస్తే అమ్మ గడ్డం పట్టుకోని బుజ్జగించేది. కాలేజీలో ఎంతో హాయిగా ఉండేది. శేఖరం పరిచయం అయిన దగ్గిర్నుంచి తన కాలేజీ జీవితం చాలా మధురంగా గడిచింది. అదే చివరికి బాధని మిగిల్చింది. తనేంచేసిందని శేఖరం అంత కోపం తెచ్చుకున్నాడు! అతన్ని వివాహంచేసుకుని జీవితంలో మాధుర్యాన్నీ, హాయినీ అనుభవించాలని ఆశించిందే! అవన్నీ కలలేనా? శేఖరంతో స్నేహం కాకపోయినా బాగుండేమో! తన యీ స్థితికి శేఖరం కారణమా! ఆమాట అనుకోగానే ఒక్కసారి మంజు త్రుళ్ళిపడింది. ఆలోచనలలా పరుగెడుతున్నాయి. మంజు కళ్ళలో నీళ్ళునిండాయి.

* * *

ఆరోజు కాలేజీ వార్షికోత్సవం. ప్రోగ్రాంలో మంజుయొక్క వీణావాద్యం కూడా ఉన్నది. మంజు చురుకైన పిల్ల అని పేరుతెచ్చుకుంది. అణకువగాను, మర్యాదతోను ప్రవర్తించేది. మంజు అంటే ప్రొఫెసర్లకీ, ప్రిన్సిపాల్ కి అందరికీ యిష్టమే. ఆమె గానమాధుర్యం అందరికీ హాయిని కలిగించింది. ప్రోగ్రామ్ పూర్తయేక బహుమతులిచ్చే ఘట్టం వచ్చింది. మంజు వీణాగానాన్ని ప్రశంసిస్తూ జిల్లా జడ్జీ బంగారు పతకం బహూకరించాడు. తెల్లని కాశ్మీర్ పట్టుచీరె, క్రేప్ సిల్కు బ్లౌజు, తలలో తెల్లగులాబీతో అతి అందంగా ఉన్న మంజు విగ్రహం విద్యార్థి సమూహంలో ఒకడైన శేఖరాన్ని చాలా ఆకర్షించింది. ఆమె నిజంగా అందం, తెలివితేటలు, మర్యాద అన్నీ పోతపోసిన విగ్రహమా అనుకున్నాడు. అప్పటికి శేఖరం అక్కడికి ఎం. ఎస్. సి. రిసర్చికి వచ్చి పదిహేను రోజులుమాత్రమే అయింది. ఆమెతో పరిచయం చేసుకోవాలని అతనికి కుతూహలం కలిగింది. మంజు యింటికి వెళ్ళేటప్పుడు స్నేహితులంతా ఆమెను ప్రశంసలతో ఉక్కిరి బిక్కిరి చేశారు.

డి. వాణి

* * *

ఆరోజు మంజు లైబ్రరీలో చదువుకుంటోంది. శేఖరం అక్కడికి వచ్చాడు. ఆమెను చూడగానే శేఖరానికేదో ఆనందం కలిగింది. తొందరగా, "మంజూదేవి కదూ మీ పేరు?" అన్నాడు. పుస్తక పఠనంలో లీనమైన ఆమె ఒక్కసారి ఉలిక్కిపడి అతనివైపు చూసి, "అవును" అంది.

"మీరు బి.ఏ. స్టూడెంట్ కదూ!" అన్నాడు.

"అవును. మీ పేరు! మీరేంచదువుతున్నారు?" అంది తొందరగా.

"నా పేరు శేఖరం. నేను ఎం.ఎస్.సి. రీసెర్చి చేస్తున్నా" అన్నాడు.

"ఆహా! చాల సంతోషం!" అని మంజు పుస్తకం చదవడంలో లీనమైంది. శేఖరం మాత్రం ఆమెను కాసేపుచూస్తూ ఉండి పోయాడు. గంట కొట్టగానే మంజు

క్లాసుకి వెళ్ళిపోయింది. కాని అతని రూపం, మాటలు ఆమె మనస్సులో మెదిలాయి.

* * *

వారంలోజులకితరవాత మంజుతల్లి చనిపోయింది. మంజు బాధకి మేరలేదు. తండ్రి గుండె దిటవు చేసుకొని ఓదార్చాడు. స్నేహితులంతా పరామర్శ చేశారు. శేఖరం వెళ్ళాలనుకున్నా వెళ్ళలేక పోయాడు. మరి వారానికి మంజు కాలేజీకి వచ్చింది. లైబ్రరీలో చదువుకుంటూండగా శేఖరం వచ్చాడు. బాధా పూరితమైన ఆమె ముఖం చూసేసరి కతనికి జాలివేసింది.

"మీ అమ్మగారు పోయారని విన్నాను. చాలా విచారకరమైన విషయం." అన్నాడు. మంజు బరువుగా కళ్లెత్తి చూచింది. ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"బాధపడకండి. ధైర్యంగా ఉండాలి. మనం యేమీ చేయలేం కదూ!" అన్నాడు ఓదార్పుగా. మంజు ఒక్కసారి అతనికళ్ళల్లోకి చూచి ముఖానికి పుస్తకం అడ్డుపెట్టుకుంది. క్లాసుకి వెళ్ళినా అతని మాటలు చెవుల్లో నిలిచిపోయాయి. ఆమె వ్యథిత హృదయానికి ఏదో ఉపశమనం కలిగింది.

* * *

సాధారణంగా శేఖరం, మంజు కలుసుకుంటూ ఉండేవారు. కాలేజీ గురించీ, చదువు గురించీ మాట్లాడుకునేవారు. క్రమంగా పరిచయం వృద్ధి అయి స్నేహంగా మారింది. ఇద్దరూ చాలాగాఢ స్నేహితులై పోయారు. శేఖరం తరుచు మంజు బంగాళాకి వెళ్లేవాడు. మంజుతండ్రికి కూడశేఖరం అంటే సదభిప్రాయం ఏర్పడింది. శేఖరాన్ని చూడగానే మంజుకేదో ఆనందం కలిగేది.

"మంజూ!" అని గేటు దగ్గర్నుంచి శేఖరం మృదువుగా పిలువగానే "శేఖర్!" అంటూ గబగబా వచ్చేది. మంజుకి శేఖరాన్నే వివాహం చేసుకోవాలని ఉండేది. శేఖరం మంజుని గాఢంగా ప్రేమించాడు. కాని ఒకరి ఉద్దేశాలొకరు తెలుసుకోలేదు.

శేఖరం ప్రకృతి చాల సంకుచితమైంది. మంజు కేవలం తనతోనే మాట్లాడా లనుకునేవాడు. తన కామెపై ఏదో అధికారమున్నట్లుగా భావించే వాడు. ఆమెపై ప్రేమ ఉన్నపుటికీ, ఆమె కొంచెం స్వేచ్ఛగా స్నేహితులతో మాట్లాడటం అతనికి ఇష్టముండేది కాదు.

మంజు విశాల భావాలుగల యువతి. తన ప్రవర్తన హద్దులు మీరకుండా ఉండేటట్లు చూసుకునేది. ఆమె నిండుహృదయం మాత్రం శేఖరానికే అర్పితమైంది. తన జీవితం ఒక పూల బాటగా గడుస్తుందను కొనేది.

* * *

'మంజూ! మీ ఇంగ్లీషు నోటుస్సకసారిస్తావా?' అన్నాడు ప్రభాకర్. ఆమె క్లాసుమేటు.

"సరే, తీసుకోండి! ఇప్పటినుంచీ పరీక్షలకి బాగా చదివేస్తున్నట్లుందే," అని చిన్నగా నవ్వుతూ పుస్తకం యిచ్చింది. ఇద్దరూ అలా మాట్లాడుతూ మెట్లుదిగి వచ్చారు. గబగబా వస్తూన్న శేఖరం యిదంతా చూచాడు. మంజుమీద తీవ్రమైన కోపం వచ్చింది. తన వస్తువేదో ప్రభాకర్ పట్టుకు పోతున్నట్లయింది. సంకుచిత భావాలకి పూర్తిగా లొంగిపోయాడు.

"శేఖర్, ఏమిటాతొందర!" అని మంజు పిలుస్తూన్న వినిపించుకోకుండా వెళ్ళిపోయాడు. మంజు అతనిని వెంబడించింది.

"ఏం శేఖర్ అంతకోపంగా ఉన్నావేం!" అంది. శేఖరం వెనుదిరిగి ఒక్కసారి ఆమె మెరిసే కళ్ళలోకి చూసి మొహం తిప్పేసుకొని వెళ్ళి పోయాడు.

మంజు కొంచెం బాధతో బరువుగా అడుగులు వేసుకుంటూ వెళ్ళిపోయింది.

* * *

మర్నాడే మహాబలిపురం ఎక్స్కర్షన్. మంజు శేఖరం వచ్చినా ఒకళ్ళతో ఒకళ్లు మాట్లాడుకో లేదు. స్నేహితులకి కాస్త ఆశ్చర్యం వేసింది శేఖరం తన సహాధ్యాయిని సరోజతో మాట్లాడుతూ ఉండిపోయాడు. స్నేహితులంతా సరదాగ తిరుగుతూ మాట్లాడుకుంటూ ఉండగా మంజ ఒంటరిగా, దిగులుగా ఉండిపోయింది. శేఖరాన్ని పలకరిస్తే ముభావంగా ఉండిపోయాడు. మంజు చాలా కష్టం అనిపించింది. సరోజ మంజుతో మాట్లాడటంచూచి శేఖరం ముఖం చిట్లించుకున్నాడు. మంజుకి చాలా దుఃఖంవచ్చింది. తనే

చేసిందని శేఖరానికి కోపం? అసలతని ఉద్దేశ మేమిటి? ఒక్కరోజులో యింతమార్పా? ఇలా ఎన్నో ప్రశ్న లామెదలలో తిరిగాయి. ఆలోచనల నుండి తేరుకొనేసరికి శేఖరం, సరోజ దూరంగా నడుస్తూ కనిపించారు. మంజు గబగబావచ్చేస్తూ వుండగా రాళ్లుతగిలి ప్రమాదవశాత్తూ పడిపోయింది. దెబ్బలుకాస్త బలంగా తగిలాయి.

"మంజూ! మంజూ పడిపోయింది," అంటూ స్నేహితులంతా కంగారుగావచ్చి లేవనెత్తి కారులో తీసుకెళ్ళి హాస్పిటల్లో జాయిన్ చేశారు. శేఖరం ఒక్కసారికూడా మంజువైపు తిరిగి చూడ లేదు. ఎక్స్కర్షన్ యీవిధంగా ముగిసిపోయింది.

* * *

స్నేహితులంతా హాస్పిటల్ కి వచ్చారు. కాని శేఖరంమాత్రం రాలేదు. మంజు ఎంతో బాధ పడింది. వారంరోజుల తరువాత ఆసుపత్రివదిలి యింటికి వచ్చేసింది. శేఖరం ఇంటికికూడా రాలేదు. ఒకరోజురాత్రి పుస్తకం చదువుతూ ఉండగా హఠాత్తుగా శేఖరం గుర్తొచ్చాడు. దృష్టి పథంలో తల్లి మెరిసింది. మంజుకి దుఃఖం పొంగి వచ్చింది. దిండులో తలదూర్చి వెక్కి వెక్కి యేడు స్తోంది. తండ్రివచ్చాడు. 'మంజూ! అలా ఏడు స్తున్నావేం' అంటే తండ్రిఒడిలో తలపెట్టి, 'నాన్నా,' అంటూ తెలియని బాధలో ఏడ్చింది. అతను ఓదార్చాడు.

పదిరోజులకి బలం చేకూరింది. కాలేజీకి తిరిగి వెళుతున్నది. శేఖరం పరివర్తన బాధగా ఉన్నా పరీక్షలకి తీవ్రంగా చదవసాగింది.

ఆరోజు గంటకొట్టేసరికి అంతా క్లాసులకి వెళ్ళి పోయారు. లైబ్రరీ చదువుకుంటూన్న మంజు తలెత్తేసరికి శేఖరం కనిపించాడు.

"హల్లో! శేఖర్! చాలారోజులకి. మా యింటికి రాలేదేం?" అన్నది.

"నేను రాకపోతే ఏమీ ఫరవాలేదే? నీ తక్కిన స్నేహితులంతా వచ్చారుగా. నాకు రావలసిన అవసరం యేముంది?" అన్నాడు పుస్తకంతీస్తూ.

"నాస్నేహితులు యెంతమంది వచ్చినా నువ్వువచ్చి నట్లుగా ఉంటుందా? చాల కొత్తగా మాట్లాడు తున్నావే?" అంది.

"నువ్వుకూడా కొత్తగానే ఉన్నావు. ఎవరి తప్పు వాళ్ళకి తెలీదుగా. అయినా, నీవొంట్లో కులాసాగా ఉందనుకుంటాను," అన్నాడు.

"నేనేం చేశానని అంతకోపం? నిన్ను చూడ గానే నా బాధంతాపోతుంది. కాని నువ్వు రాలేదు," అంది దీనంగా.

"సరే, సెలవు," అని శేఖరం తప్పించుకుని వెళ్ళిపోయాడు. మంజు అతనువెళ్ళినవైపే చూస్తూ ఆలోచనలో మునిగిపోయింది.

* * *

మంజు శేఖరంతో మాట్లాడదామనుకున్నా యెక్కడా కనిపించలేదు. మరి రెండురోజులకి యిద్దరూ పార్కులో కలిశారు. శేఖరం మూలగా బెంచీమీద కూర్చున్నాడు. సంజెచీకట్లు వ్యాపి స్తున్నాయి. క్రమంగా అందరూలేచి యిళ్ళకు వెళ్తున్నారు. శేఖరాన్ని చూడగానే మంజుకి ప్రాణం లేచివచ్చినట్లయింది. గబగబావెళ్ళి బెంచీ మీద కూర్చుంటూ, 'హల్లోశేఖర్,' అంది. శేఖరం ఉలిక్కిపడి దూరంగా జరిగాడు.

"ఏం శేఖర్! అంతకోపం?" అంది.

"దానికి నువ్వేకారణం" అన్నాడు తడబడుతూ.

"నేనా? నేనేం చేశాను?" అంది.

"ఏమో? నువ్వు చాలా స్వేచ్ఛాజీవివిగా! నీప్రవర్తన నీకే తెలియాలి," అని వెళ్ళబోయాడు.

"శేఖరం, నువ్వుచాలా వింతగా మారిపోయావు. కారణంలేని కోపం తెచ్చుకుని 'నీప్రవర్తన,' అని అంటున్నావు. కాస్త అసలు సంగతేదో చెప్పవూ?" అంది బాధగా.

"నీ ప్రవర్తన చాలాహద్దులు దాటుతోంది. అయినా నేనుచెప్పటం యెందుకులే? నీకే తరువాత తెలుస్తుంది. ఇకనేను ఎంతగామారానంటావా? నువ్వే వింతగా మారినప్పుడు నాలో వింత నీకెలా గోచరిస్తోంది? వెళ్తాను." అంటూ వెనుతిరిగాడు.

"నేనా!నన్నంత పిచ్చిదాన్ని చేశావేం శేఖరం?" అంటూ ఆవేశంగా అతనిదారికి అడ్డంగానిలిచి చేయి పట్టుకుంది. నిర్మానుష్య వాతావరణం ఆమెను మరింత ఉద్రేకపరిచింది. శేఖరం అప్రయత్నంగా ఆమె ప్రకాశవంతమైన కళ్ళలోకిచూచి చెయ్యి వదిలించుకుని వెళ్ళిపోయాడు.

బి. ఏ. పరీక్షలకి మంజు చాల తీవ్రంగా చదివి పరీక్షలు చాలబాగా రాసింది. శేఖరం ఒక్కసారి కూడా మంజును పలుకరించలేదు. అతడు మంజు నిష్కల్మష హృదయాన్ని అణుమాత్రం అర్థం చేసుకోలేకపోయాడు. క్రమంగా మంజుపై గల యిష్టం అంతా కరిగిపోసాగింది. ఆమెను తప్పించుకునే తిరిగేవాడు. మంజు మనస్సు బాధకు గురైంది. కారణంలేకుండా శేఖరం ఎందుకు కోపం తెచ్చుకున్నాడని బాధపడేది. క్రమంగా ఆమె పరిపూర్ణ హృదయం బాధాపూరితమైపోయింది. కాలేజీ మూసేసిన తరువాత శేఖరాన్ని చూడటానికి కూడా అవకాశం లేకపోయింది.

* * *

ఆ రోజు తండ్రితో కలిసి మంజు సినిమాకి వెళ్ళింది. శేఖరం, సరోజ కూడా వచ్చారు. మంజు యిక ఆగలేకపోయింది. గబగబా వెళ్ళి, "హల్లో శేఖర్ చాలరోజులకి," అంది బలవంతంగా నవ్వుతూ. శేఖరం ఉలిక్కిపడి చిరాగ్గాముఖం త్రిప్పుకున్నాడు. సరోజ కాస్త మాట్లాడింది. మంజుకి దుఃఖం వచ్చింది. అసలే బాధపడే ఆమెకా విషాదాంత చిత్రం మరీ బాధకలిగించింది. తలనొప్పితో యింటికి వచ్చింది. మర్నాటికి తీవ్రమైన జ్వరం వచ్చింది. తండ్రి కంగారుగా డాక్టరును తీసుకొచ్చాడు. గాలిమార్పు చేయాలని చెప్పాడు డాక్టరు. ఆ కారణంగా మంజు తండ్రితో ఊటీ వెళ్ళింది. కాని ఆమె శారీరకంగాను, మానసికంగానూ యేమాత్రం కోలుకోలేకపోయింది. ఆమెకెప్పుడూ శేఖరం, తల్లీ గుర్తొచ్చేవారు. శేఖరాన్ని కలుసుకోవాలని, అతని పూర్వపు మృదువైన పిలుపు వినాలనీ ఆమె మనస్సు తహతహలాడసాగింది. నిరంతరం బాధ పడేది. తండ్రి ఆమెను చాలా జాగ్రత్తగా చూసుకునేవాడు.

తన సర్వస్వం అని నమ్ముకున్న శేఖరం విముఖత మంజు హృదయాన్ని గాయపరిచింది.

* * *

మంజు కుర్చీలో కూర్చుండిపోయింది. ఆమె కళ్ళల్లోంచి నీళ్ళు కారిపోతున్నాయి. "మంజూ" అన్న పిలుపు, భుజంమీద చేయిపడటంతో ఉలిక్కిపడి ఆ వ్యక్తిముఖంలోకి చూసింది. సరోజ!

"నీ వంట్లో యెలా ఉంది మంజూ?" అంది సరోజ.

"ఏదో జ్వరంవస్తూంది" అంది నిరాశామిళితమైన నవ్వుతో. కాస్సేపు యిద్దరూ మౌనంగా ఉండిపోయారు.

"రిసెర్చి నీదీ, శేఖర్‌దీ పూర్తైందికదూ!" అంది మంజు.

"ఆఁ! పూర్తి అయింది" అని ఊరుకుంది.

కొంతసేపయాక సరోజా ఒక్కసారిగా కుర్చీలోంచి లేచి మంజు చేతులుపట్టుకుని, 'నన్ను క్షమిస్తావనుకుంటాను మంజూ' అంది. మంజుకి ఆశ్చర్యంవేసింది.

"ఏమిటి సరోజా? చెప్పవూ?" అంది.

"నేను శేఖరాన్ని పెళ్ళి చేసుకోబోతున్నా మంజూ!" అంది. మంజుకి చెంపదెబ్బ కొట్టినట్లయి ఒక్కసారి కుర్చీలో వెనక్కు వాలిపోయింది. శేఖరం తనని మోసం చేశాడా? తన జీవితంలో ఆశలన్నీ కూలిపోయాయి. పూలబాట యెడారిబాటే. శేఖరం తనని ప్రేమిస్తున్నాడని భ్రమించిందా? తనంటే శేఖరాని కిష్టంలేనప్పుడు తను అతన్ని యేవిధంగా పెళ్ళిచేసుకోగలదు? అయినా మృత్యుద్వారంలో అడుగుపెట్టే తను శేఖరాన్ని కోరటం భావ్యమా? తనహృదయం అతని పరమైనప్పుడు తను అతని సుఖం కోరాలికదా? అతన్ని సరోజ పెళ్ళిచేసుకోవటమే యుక్తం! మంజు కళ్ళలోంచి అశ్రువులు ధారలుగా కారాయి. సరోజ దిగులుగా ఉండి పోయింది. మంజు కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ, "చాలా సంతోషం సరోజా! ఎప్పుడు వివాహం?అయినా దీనికి క్షమాపణేమిటి?" అంది మందహాసం చేస్తూ.

"నేను ద్రోహిని మంజూ! శేఖరాన్ని నువ్వు—" అని ఆగిపోయింది.

"ఛా! నువ్వు ఎంతో మంచి దానివి సరోజా! నేను శేఖరాన్ని ప్రేమించిన మాటనిజమే.మృత్యుద్వారంలో అడుగుపెట్టే నేను శేఖరాన్నేవిధంగా పెళ్ళిచేసుకోగలను? అయినా నాకు అతని సుఖమే ప్రధానం సరోజా! అతన్ని బాధ పెట్టకుండా సుఖంగా జీవితం గడుపుతావుకదూ! ఇదేనాకోరిక" అంది మంజు గద్గదికంగా. సరోజ మంజు ఔదా

ర్యానికి ఆశ్చర్యపోయింది. మంజూపై గౌరవంతో ఆమె హృదయం నిండిపోయింది.

"మంజూ! ఇదుగో శుభలేఖ" అంటూ ఇచ్చింది. మంజు సరోజతో, "నా ఆరోగ్యం యేమాత్రం బాగులేదు సరోజా! నేను రాలేను. నువ్వు, శేఖరం మాత్రం ఒక్కసారి మా యింటికి రావాలి" అంది. సరేనని సరోజ వెళ్ళిపోయింది.

జీవితం అంతా నిరాశా పూరితమైపోగా, కుర్చీలో కూర్చున్న మంజు బాధగా నిట్టూర్చింది.

ఆ రాత్రినుండి ఆమెకు జబ్బు యెక్కువై పోయింది.

* * *

శేఖరం, సరోజల వివాహం జరిగిపోయింది. తనకు, మంజుకు జరిగిన సంభాషణను దాచలేక పోయింది సరోజ. అది విన్న శేఖరం చాలా బాధపడ్డాడు. చేతిలో పెన్నిధి జారవిడుచుకున్నట్లుగా ఫీలయ్యాడు. ఆమె నిర్మల హృదయాన్ని అర్థం చేసుకోలేకపోయినందు కెంతో విచారించాడు. ఆమెను చూడాలని అతని మనస్సు వేగిర పడసాగింది.

ఒకరోజు శేఖరం, సరోజా కలిసి మంజు ఇంటి కెళ్ళారు. మంజుమట్టుకారోజు జ్వరంగా ఉంది. శేఖరాన్నీ, సరోజనూ చూచి లేచి కూర్చుంది.

"నన్నిప్పటికేనా అర్థం చేసుకున్నావా శేఖరం? అయినా నాప్రవర్తనలో విపరీతం ఏమిటో బోధపడలేదులే" అంది మంజు.

"నీ ప్రవర్తనలో విపరీతం ఏమిటి మంజూ? అదంతా నా అపోహ. నాకు అణుమాత్రం లేని అధికారాన్నేదో నామీద చూపెట్టబోయాను మంజూ!" అన్నాడు బాధగా.

"సరోజని అనవసరంగా బాధపెట్టకు శేఖర్! అమాయకురాలు. మనని ప్రేమించేవారిని అన్యాయం చేసి దూరంచేసుకోకూడదు శేఖరం! నా మాట వినవూ?" అంది మంజు.

"నన్ను క్షమించు మంజూ! నా అల్పబుద్ధే యింత పనిచేసింది. మంజూ నువ్వు నిజంగా మణిపూసవి" అన్నాడు.

"పిచ్చివాడివి శేఖరం" అంటూ మంజు అప్రయత్నంగా శేఖరం చేతులు పట్టుకుంది. శేఖరం హృదయం ద్రవించిపోయింది. మంజుకి తనపై గౌరవం, ప్రేమ ఉన్నాయా? అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. మంజు చేతులపై అతని కన్నీళ్లు రాలాయి.

"ఛీ బాధపడకు శేఖరం! మనకి పొరపాట్లు వస్తూనే ఉంటాయి. అయితే నేను కోరేదేమటంటే నన్ను జ్ఞాపకముంచుకోమని శేఖరం!" అంది మంజు. ఆమె కళ్ళు నీళ్ళతో నిండాయి. శేఖరం అక్కడ నిలవలేకపోయాడు.

"వెళ్తాం మంజూ" అని ఇద్దరూ లేచారు. మంజు మెట్లవరకూ వచ్చింది. శేఖరం రెండు మెట్లు దిగి వెనుదిరిగి, మంజు కాంతి విహీనమైన ముఖంలోకి చూశాడు. ప్రకాశవంతమైన ఆమె కళ్లు నీళ్ళతో నిండి ఉన్నాయి. శేఖరం బాధగా ముఖం తిప్పుకుని వెళ్ళిపోయాడు. శేఖరం మెట్లు దిగేసరికి మంజు నీరసంగా 'మానసిక శాంతి యీనాటికి లభించింది శేఖరం' అని అనగలిగింది. శేఖరం ఒక్కసారి మీదికిచూచి గబగబా వెళ్ళిపోయాడు. మంజు స్పృహతప్పి పడిపోయింది. ఆనాటినుంచీ ఆమెకు రుగ్మత మరీ హెచ్చిపోయింది. తండ్రి ఎన్నెన్నో మందు లిప్పించేవాడు. ఒక్కొక్కప్పుడు సంతోషంగా ఉండేది. ఆఖరికి క్రమంగా లేవలేక పడుక్కునే ఉండేది.

నాలుగు రోజుల తరవాత మంజుకి జబ్బుక్కువైపోయింది. తండ్రి బెంగతో ఆమె మంచం వదలలేదు. రిజల్ట్సు ఆనాడే వచ్చాయి. మంజు ఆతురతతో ఎదురుచూసింది పేపరుకోసం. క్రమంగా తెలివితప్పుతోంది.

"మంజూ! నీది యూనివర్సిటీఫస్టు. ఇదుగో ఫొటోతోసహా పడింది మంజూ," అంటూ తండ్రి సంతోషంతో పేపరు తెచ్చాడు.

"ఆఁ! ఆఁ" అంటూ మంజు తెలివి తప్పుతూండగా తలవాల్చింది. 'మంజూ! మంజూ,' అంటూ ఆదుర్దాగావచ్చి ఆమెతల ఒడిలోపెట్టుకొని ముఖం మీద నీళ్లు జల్లాడు.

మంజు బరువుగా కళ్ళెత్తి 'అ-మ్మా, నా-న్నా-నా-న్నా,' అంటూ నిశ్చితంగా కళ్లుమూసింది. ఒక్క మందహాసం ఆమె పెదవులమీద వెలిగి, అంతలోనే అదృశ్యమై అంతరిక్షంలో లీనమై పోయింది.

★